

మా భూములివ్వం

- గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ భూసేకరణ సభను బహిష్కరించిన రైతులు
- రీ డిజైన్ చేయాలని ఆర్డీవోకు వినతి



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న 13 ఎల్ కాలువ నిర్మాణ బాధితులు

హుస్నాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం గౌరవెల్లి రిజర్వాయర్ 13 ఎల్ కాలువ నిర్మాణం కోసం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్వహించిన భూసేకరణ గ్రామసభను రైతులు బహిష్కరించారు. ఈ కాలువ నిర్మాణంతో తీవ్రంగా నష్టపోతున్నామని, రీ డిజైన్ చేయాలని ఆర్డీవో రామ్మూర్తికి రైతులు వినతిపత్రం అందజేశారు. కాలువ నిర్మాణంతో కొద్దిపాటి భూములు కోల్పోయి రోడ్డున పడుతామని గోడు వెళ్లబోసుకున్నారు. 12 ఏళ్ల క్రితం డీ4 కాలువను తవ్వారని, ప్రస్తుతం ఆ కాలువను వినియోగించుకోవడం లేదన్నారు. డీ4 కాలువను వినియోగంలోకి తీసుకురావాలని, లేదంటే వేరే చోట నుంచి నిర్మించాలని రైతులు కోరారు. భూములు కోల్పోతున్న బాధితులకు ఎలాంటి సమాచారమూ లేకుండా గ్రామసభను నిర్వహించారని ఆరోపించారు. కాలువ నిర్మాణంతో తాము తీవ్రంగా నష్టపోతామని సభను బహిష్కరించారు. గ్రామసభలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రాములులతో పాటు బాధితులు మర్యాల మహేశ్వర్‌రెడ్డి, జాల జ్యోతికుమార్, మర్యాల రాజిరెడ్డి, నవీన్, బీఆర్ఎస్ నియోజవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, అయిలేని శంకర్‌రెడ్డి, బూరుగు కిష్టస్వామి, హరీశ్, కోటి పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

అక్కన్నపేట: 'మా భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ నిర్మించి మమ్మల్ని రోడ్డున పడేయొద్దని, న్యాయం చేయండి" అని సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ మనుచౌదరికి అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనంబర్ 312లో 150 కుటుంబాలకు 5 గుంటల నుంచి ఎకరం వరకు స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో పట్టాలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ భూము ల్లో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

విద్యార్థులు పరిశోధనాత్మకంగా చదవాలి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

7

న్యూస్ బాక్స్



కోహెడలో మాట్లాడుతున్న పొన్నం

దేశిని చిన మల్లయ్య సేవలు మరువలేనివి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే దేశిని చినమల్లయ్య ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహనీయుడని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం దేశిని చిన మల్లయ్య వర్ధంతి సందర్భంగా ప్రకటనలో నివాళులర్పించారు. సర్పంచ్‌గా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమై ఇందుర్తి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తుచేశారు. హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో దేశిని చిన మల్లయ్య విగ్రహ ఏర్పాటు చేసే స్థలం వద్ద గౌడ సంఘం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, కిసాన్‌సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు ఎలగందుల శంకర్, పూదరి శ్రీనివాస్, తిరుపతి, మల్లయ్య, రాజయ్య, రాజు, రామస్వామి, పలువురు పాల్గొన్నారు.

సదర్ సంబురం

కోహెడ: కోహెడలో సదర్ ఉత్సవాలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. సాంస్కృతిక పరిరక్షణకు సదర్ ఉత్సవాలు ఎంతో తోడ్పడుతాయని మంత్రి వివరించారు. సదర్ ఉత్సవాలకు అధికారిక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ వేడుకను చూడడానికి భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దున్నల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఇంటికి గంట

- నెమ్మదిగా సాగుతున్న కుటుంబ సర్వే
- రోజుకు ఐదారు ఇళ్లకే ఎన్యూమరేటర్లు పరిమితం
- 70 ప్రశ్నలు, కోడ్ సమాధానాలతో జాప్యం
- పెరుగుతున్న కుటుంబాల సంఖ్య
- ఇళ్లలో ఉండకపోవడంతో ప్రదక్షిణలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేకు బాలారిష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని ప్రతీ ఇంటికి వెళ్లి సమగ్ర వివరాలు సేకరించే ఉద్దేశంతో చేపట్టిన ఈ సర్వే మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించి సర్వే బాధ్యతలు అప్పగించారు. అయితే, మధ్యాహ్నం తర్వాతనే వారు సర్వే చేపట్టాల్సి రావడం ఈ అలసాయానికి ఒక కారణం కాగా... వీరు వెళ్లిన సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో పలుమార్లు ఇంటి చుట్టూ తిరగాల్సి రావడం మరో కారణం. ఇక ప్రశ్నలను కూలంకుషంగా చర్చించి సమాధానాలు రాబట్టడానికి దాదాపు గంట సమయం పడుతోంది. ఈ క్రమంలో సర్వే పూర్తి కావడానికి మరింత గడువు పెంచక తప్పని పరిస్థితి.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, నవంబరు 11



మద్దూరులో కుటుంబ సర్వేలో భాగంగా వివరాలను సేకరిస్తున్న ఎన్యూమరేటర్

జిల్లాలో తొలుత 3,45,312 నివాసాలు ఉన్నట్లుగా గుర్తించారు. కానీ కుటుంబాల లెక్క తేలలేదు. ప్రస్తుతం సర్వే ప్రారంభించడంతో ఇళ్లలోకి వెళ్లిన ఎన్యూమరేటర్లు కుటుంబాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. ముందుగా ఎన్యూమరేటర్లకు 150 ఇళ్ల వరకు కేటాయించగా.. ఇప్పుడు 200 పైచిలుకు కుటుంబాలను సర్వే చేయాల్సి వస్తోంది. అదనంగా సర్వే ఫారాలను సమకూర్చుకుంటున్నారు. మొత్తంగా 4 లక్షల కుటుంబాలు ఉండే అవకాశం కనిపిస్తోంది.

ఉన్నది ఉన్నట్లు చెప్పలేక..

సర్వే ఫారంలో 70కి పైగా ప్రశ్నలు ఉన్నాయి. వీటికి కోడ్ రూపంలోనే సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అయితే పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు మినహాయిస్తే మిగితా ప్రశ్నలన్నింటికీ ఆచితూచి సమాధానాలు ఇస్తున్నట్లుగా ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. దీని వల్ల ఒక్కో ఇంటికి 40 నిమిషాల నుంచి గంట దాకా సమయం కేటాయించాల్సి వస్తోందని అంటున్నారు. కోడ్ రూపంలో సమాధానాలను నమోదు చేయడం కూడా జాప్యానికి ఒక కారణంగా ఎత్తి చూపుతున్నారు. ఆస్తులు, సంక్షేమ పథకాలు, వాహనాల గురించి చెప్పే సందర్భంలో పూర్తిగా గుట్టు విప్పడం లేదన్నట్లుగా తెలుస్తోంది. గ్యాస్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనర్, స్మార్ట్‌ఫోన్, టీవీ ఉందా.. లేదా? అనే ప్రశ్నలు కూడా ఉండడంతో కొందరు సభ్యులు దాటవేస్తున్నారు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం వల్ల ప్రభుత్వపరంగా ప్రయోజనాలు దక్కవేమోననే మీ మాంసలో ఉంటున్నారు.

40,232 కుటుంబాలు పూర్తి..

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 3,45,312 ఇళ్లు ఉన్నట్లుగా అధికారులు లెక్కతేల్చారు. అయితే కొన్ని ఇళ్లలో రెండేసి కుటుంబాలు ఉన్న

మిగతా 8వ పేజీలో...

98కి తొమ్మిదే..

- 'సుడా' ప్లాట్లకు స్పందన కరువు
- మిగిలిన వాటికి ఈనెల 20న వేలం

సిద్దిపేట అర్బన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మిట్టపల్లిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ప్లాట్ల వేలానికి స్పందన కరువైంది. 98 ప్లాట్ల వేలానికి గాను కేవలం ఏడుగురు మాత్రమే వేలం పాటలో పాల్గొనగా ఇద్దరు రెండేసి ప్లాట్ల చొప్పున దక్కించుకున్నారు. మిగిలిన వారు ఒక్కోప్లాట్ చొప్పున దక్కించుకున్నారు. వేలంలో అత్యధికంగా గజం రూ.6600కు ముంద్రాయి గ్రామానికి చెందిన గుండెల్లి లింగం పాడారు. పలువురు రూ.5,700కు ప్లాట్లను దక్కించుకున్నారు ముం ద్రాయి గ్రామానికి చెందిన గుండెల్లి లింగం 2, అతని బంధువు తరఫున ఒకటి మొత్తం మూడు ప్లాట్లను ఒక్కడే వేలం పాటలో దక్కించుకున్నాడు. తండ్రి కూతుళ్లు అయిన అనంతుల వీరన్న, నిఖిల ప్లాట్ నంబర్ 95, 96ను గజం రూ.5700 చొప్పున వేలంపాటలో దక్కించుకున్నారు. రాగుల రవీందర్ ప్లాట్ నంబర్ 59ను రూ.5700కు, ఓజ్జల జయంతి ప్లాట్ నంబర్ 58ను 5700కు, చామల ప్రశాంత్ ప్లాట్ నంబర్ 100ను 5700కు, పెండెం శశికాంత్ ప్లాట్ నంబర్ 97ను 5700కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా 'సుడా' వైస్‌చైర్మన్ అశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ వేలంలో ప్లాట్లను దక్కించుకున్న వారు వారంలోగా 25 శాతం డబ్బు కట్టాలని, మిగిలిన మొత్తాన్ని 60 రోజుల్లో పూర్తిగా కట్టాలన్నారు. మొత్తం డబ్బును వారం లోపు కడితే మూడుశాతం రీబెట్‌ను అందించనున్నట్లు తెలిపారు. మిగిలిన ప్లాట్లకు ఈ నెల 20న మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సుడా ఆఫీసులో సంప్రదించాలని కోరారు.



సిద్దిపేటలో వేలం నిర్వహిస్తున్న 'సుడా' అధికారులు

'సుడా' ఆఫీసు వద్ద భూబాధితుల నిరసన

సుడా కార్యాలయంలో వెంచర్‌కి సంబంధించిన వేలంపాట జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న మిట్టపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ సతీష్, అఖిల్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. సుడా వెంచర్‌కు సంబంధించి తమకు ఎలాంటి పరిహారం అందించలేదన్నారు.

సమస్యలు పునరావృతం కావొద్దు

- కలెక్టర్ మనుచౌదరి
- 'ప్రజావాణి'కి మొత్తం 77 ఫిర్యాదులు

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల సమస్యలు పునరావృతం కావొద్దని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించి ప్రజావాణిలో ఆయన ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 77 ఫిర్యాదులు వచ్చాయని వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు.

అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి

మైనార్టీ సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా అబ్దుల్ కలాం ఆజాద్ సుదీర్ఘ కాలం పని చేశారని, ఆయన ఆశించిన విధంగా దేశీయ విద్యరంగాన్ని వికసింపచేయడానికి గట్టి చర్యలు అవసరమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

దర్జాగా దళారుల కొనుగోళ్లు

- వెంకటేశ్వరపల్లిలో మొదలు కాని కొనుగోలు
- 25 రోజులుగా రైతుల పడిగాపులు
- ఇదే అదనుగా మార్కెట్‌యార్డులోకి వ్యాపారుల ప్రవేశం!
- వారు చెప్పిన రేటుకు ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు



వెంకటేశ్వరపల్లి మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కోహెడ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌లో సాగు చేసిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు ఆదిలోనే అవస్థలు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని అధికారులు, నాయకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామ పరిధిలో గల మార్కెట్ కమిటీ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికీ 25 రోజులు దాటుతున్నా కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదు. వర్షం భయానికి తోడు కొనుగోలు కేంద్రంలో అనేక కొర్రీలు పెడుతుండడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు మార్కెట్ కమిటీ యార్డులోకి దర్జాగా వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తాలు గడ్డి శుభ్రం చేసి ధాన్యం తెస్తే ప్రభుత్వ ధర క్వింటాకు రూ 2,320తో పాటు బోనస్ రూ.500 అదనంగా ఇస్తామని అధికారులు చెబుతున్నా కూడా రైతులు మాత్రం వ్యాపారులకు రూ 2,150 చొప్పున విక్రయిస్తున్నారు. ఆరబెట్టకుండా ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తరలిస్తే వ్యాపారులు రూ.1900 చొప్పున చెల్లిస్తున్నారు.

వ్యాపారులకే అమ్ముతాం



మా గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 25 రోజులు దాటింది. కానీ కొనుగోళ్లను మాత్రం ప్రారంభించలేదు. అడిగితే తేమ శాతం లేదంటున్నారు మాయిశ్చరైజర్ పనిచేయడం లేదు. వర్షం వచ్చేలా ఉండడంతో వ్యాపారులకే విక్రయించాలనుకుంటున్నాం.

– రమ, మహిళా రైతు, వెంకటేశ్వరపల్లి

రైతులు ముందుకు రావడం లేదు

మార్కెట్ కమిటీ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. నిబంధన ప్రకారం తేమ, తాలు ఉండకూడదు. రైతులు మాత్రం మీకు అమ్మబోం అంటూ చెబుతున్నారు. కేంద్రంలోకి వ్యాపారులను పిలిచి మరి ధాన్యం విక్రయిస్తున్నారు. తాలు పట్టే యంత్రం పలుమార్లు పాడైతే మరమ్మత్తులు చేసినా మళ్లీ చెడగొడుతున్నారు. ఇక రైతుల ఇష్టానికి వదిలిపెట్టాం.

– మల్లికార్జున్ సీఈవో, పీఏసీఎస్ కోహెడ



అమ్మా..నాన్న ఓ అందమైన భవనం

- వారిపై ప్రేమతో నిర్మాణం
- వివిధ రాష్ట్రాల నుంచి మెటీరియల్

7

భూసార పరీక్షా కేంద్రం అలంకారప్రాయం

- ఏడాదిన్నర పూర్తయినా భూసార పరీక్షలు ఊసేలేదు
- పరికరాలు, సిబ్బంది కేటాయింపు కరువు
- ప్రశ్నార్థకంగా గజ్వేల్‌లోని పరీక్షా కేంద్రం భవిష్యత్

8

గ్రూప్-3కు పకడ్బందీ ఏర్పాట్లు

● మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల కోసం జిల్లాలోని మెదక్ సబ్‌డివిజన్‌లో 12, తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 7, మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజేషన్ వంటివి చేపట్టాలన్నారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 6, రూట్ ఆఫీసర్స్ 6, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్ 19 మంది చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు. లోనికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగే పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5867 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను న పడపాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ఉంటుందని, సమయానికి అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మెంచు నగేష్

వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల నిరసన



గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కోహీర్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోహీర్ గ్రామపంచాయతీ వద్ద పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము మురికి కాలువలు, వీధులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నప్పటికీ జీతాలు సకాలంలో చెల్లించడం లేదని వాపోయారు. 23 మంది కార్మికులకు నాలుగు నెలలకు సంబంధించిన రూ.9.20 లక్షలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధికంగా సమ్మెలో కొనసాగుతామని వారు మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా రాసిచ్చారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కల్హేర్/వెల్దుర్తి/హత్నూర/ చిన్నశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా విద్యార్థులు పలు క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. హత్నూర మండల పరిధిలోని సిరిపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.హరిప్రసాద్, 8వ తరగతికి చెందిన కాలే నాగేశ్వరీ జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను మాజీ సర్పంచ్ నరేందర్ శాలువాతో సన్మానించారు. సిర్గాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన గోకుల్‌కృష్ణ 68వ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 38 కేజీల విభాగంలో మూడోస్థానంలో నిలిచారు. పాఠశాల హెచ్ఎం, సిర్గాపూర్ మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మనేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నందిని అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను, ఉమ్మడి మెదక్ జిల్లా పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి నందినిని ఎంఈవో యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నందినీకి రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీలలో చిన్నశంకరంపేట మండలంలోని టీఎస్ఎంఎస్, మొదటిస్థానం, మిర్జాపల్లి హైస్కూల్ రెండో స్థానంలో నిలిచినట్లు ఎంఈవో పుష్పవేణి తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

చిన్నశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రైతులు మండలంలోని గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు మెదక్ - చేగుంట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, నవంబరు 11 : టూరిస్టు బస్సులో నిషేధిత గోవా మద్యం తెలంగాణకు తీసుకువస్తున్న క్రమంలో సోమవారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టువద్ద పట్టుకున్నామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ బృందం వివరాల ప్రకారం.. తమ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులతో కలిసి మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలను చేపట్టాం. అందులో భాగంగా టూరిస్టు బస్సులో తనఖీలు చేయగా 11 లీటర్ల నిషేధిత మద్యం పట్టుబడింది. ఈ మేరకు మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వేర్వేరు కేసుల్లో 8 ఏళ్ల జైలు

● రూ.వెయ్యి చొప్పున జరిమానా

రామచంద్రాపురం, నవంబరు 11 : రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022వ సంవత్సరంలో ఒకేరోజు జరిగిన కానిస్టేబుల్‌పై కత్తిపోట్లు, చైన్‌స్నాచింగ్ కేసులు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఈ కేసుల్లో రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 26వ తేదీ 2022న భెల్ హెచ్ఐజీలో ఓ మహిళ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెలారు. అదే రోజు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు జరిగాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు గస్తీని మరింతగా పెంచారు. గండమ్మ ఆలయం వద్ద గస్తీ కాస్తున్న సీసీఎస్ పోలీసులు యాదయ్య, రవికి ఇద్దరు వ్యక్తులు పల్సర్‌పై అనుమానస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని వెంబడించి హెచ్ఐజీ వద్ద పట్టుకునే ప్రయత్నం చేయగా నిరంజన్ అనే వ్యక్తి కత్తితో పోలీసు యాదయ్యపై దాడిచేశాడు. పోలీసులు నిందితులు నిరంజన్(23), రాహుల్(21)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడి కేసులో ఏడు సంవత్సరాలు, చైన్ కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు సీఐ జగన్నాథ్ తెలిపారు. ఇద్దరు నేరస్థులు కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా, హుమ్నాబాద్ అయ్యర్వాడీకి చెందినవారని తెలిపారు.

కారు డ్రైవరే దొంగ

● ముగ్గురు నిందితుల రిమాండ్

జోగిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యజమాని ఇంట్లో దూరి.. తల్లిని బంధించి, చోరీకి పాల్పడ్డ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. వట్‌పల్లి ఎస్ఐ విఠల్‌తో కలిసి సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి బీదర్ పట్టణంలో ఎరువుల దుకాణాన్ని నడుపుతుండగా, అక్కడే సొంత ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాడు. ఆయనకు పల్వట్లలో 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే, వెంకట్‌రెడ్డి తల్లి సునందమ్మ పల్వట్లలోని ఇంట్లో ఒంటరిగా ఉంటూ పనులను చూసుకుంటోంది. ఈ క్రమంలో బీదర్‌కి చెందిన వెంకట్‌రెడ్డి దూరపు బంధువు మహిపాల్‌రెడ్డిని కారు డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. మహిపాల్‌రెడ్డి పాత నేరస్థుడన్న విషయం వెంకట్‌రెడ్డికి తెలియదు. కంది జైలులో పరిచయం అయిన పాత నేరస్థులు మొహిసిన్, సోహైల్‌తో కలిసి మహిపాల్‌రెడ్డి పల్వట్లలోని ఇంట్లో దొంగతనానికి పథకం రచించాడు. గత నెల 21న రాత్రి సునందమ్మను బంధించి 4 తులాల బంగారు గొలుసు, 2 తులాల చెవి కమ్మలతోపాటు, రూ. 20 వేల నగదును దోచుకుని పారిపోయారు. వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు విచారించి నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వివిధ రాష్ట్రాల నుంచి మెటీరియల్..

డూప్లెక్స్‌గా నిర్మించిన భవనానికి వివిధ రాష్ట్రాల నుంచి మెటీరియల్ తెప్పించారు. మైసూర్ నుంచి ప్లైవుడ్, గుజరాత్ నుంచి గ్రానైట్, బెంగుళూర్ నుంచి పార్కింగ్ గ్రానైట్, బాంబె నుంచి లైటింగ్‌ను తెప్పించారు. భవనంలోకి వెళ్లగానే ఎత్తైన బుద్ధుడి చిత్రం ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుంది. దీనిని కోల్‌కతాకు చెందిన ఆర్టిస్టుతో వేయించారు. సెన్సార్లతో డోర్లు, లైట్లు వంటివి వెలిగేలా ఏర్పాట్లు చేశారు. భవనానికి విద్యుత్ సరిపడేలా పైన సోలార్ ప్లాంట్, ప్రహరీ చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. భవనంలో ఫర్నిచర్, ఓపెన్ కిచెన్, డ్రెస్సింగ్ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు ఇలా సకల వసతులున్నాయి.



జిల్లెలగడ్డలో అమ్మానాన్న నిలయం

అమ్మా.. నాన్న.. ఓ అందమైన భవనం

- వారిపై ప్రేమతో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న ఇంటీరియల్ డిజైన్లు



భవన ప్రవేశ గదిలో బుద్ధుడి చిత్రం, జూమర్ లైట్

హుస్నాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని జిల్లెలగడ్డ గిరిజన తండాకే హైలెట్ ఆ భవనం. అధునాతనమైన ఇంటీరియర్ డిజైన్లతో తండాకు చెందిన వ్యాపారి లావుడ్య వీరన్ననాయక్ తన అభిరుచికి అనుగుణంగా నిర్మించారు. పుట్టిన ఊరులో నివాసించాలనే ఆకాంక్ష... తల్లిదండ్రులపై ఉన్న ప్రేమతో 'అమ్మానాన్నల నిలయం' పేరిట అద్భుతంగా తీర్చిదిద్దాడు. హుస్నాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదారిలో పక్కన ఈ భవనం చూపరులను ఆకర్షిస్తున్నది. వీరన్న నాయక్ మొదట ఇటుకబట్టీలు, వ్యవసాయ కూలీ కాగా, ప్రస్తుతం ఇటుక బట్టీలతో పాటు పలు వ్యాపారాలు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. హైదరాబాద్, వరంగల్ లోనూ భవనాలున్నప్పటికీ తన ఎదుగుదలకు దోహద పడిన సొంత ఊరులో నివాసం ఉండాలని కోరికతో దీన్ని నిర్మించినట్లు చెబుతున్నాడు. ఆయన భార్య విజయ 2009 నుంచి 2014 వరకు ఈ తండాకు సర్పంచ్‌గా కూడా పని చేశారు.



సోలార్ ప్లాంట్



విశ్రాంతి గదిలో వీరన్ననాయక్



భవన ప్రవేశద్వారం ఎదుట..



కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లండి

భవిష్యత్తు మనదే.. నర్సాపూర్ ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నర్సాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. 9వ తేదీన కౌల్దారంలో రైతుల దీక్ష విషయాలు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ నర్సాపూర్ నియోజకవర్గంలో రైతుల దీక్ష విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని వారికి సూచించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ బలంగా ఉందని, అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు ఏ మాత్రం భయపడవద్దని అని అన్నారు. మీకు తాము ఎప్పుడు అండగా ఉంటామని అధికార పార్టీ చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ ప్రజల్లోకి వెళ్లాలన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ సునీతారెడ్డికి అండగా ఉండాలని సూచించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేస్తున్న తప్పిదాలే వారికి శాపంగా మారి ఓటమి చెందడం ఖాయమన్నారు. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే అని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాయకులు సత్యంగౌడ్, హుస్సేన్, ప్రసాద్, దుర్గారెడ్డి, ప్రవీన్, నరహరి, శేఖర్ పోచయ్య, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్ షురూ



హాజరైన వివిధ జిల్లా క్రీడాకారులు

- 1100 మంది క్రీడాకారులు హాజరు
- విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్ అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం 10వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన 13 గురుకులాల క్రీడాకారులు 1105 మంది హాజరయ్యారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, కో ఆర్డినేటర్ సువర్ణలత క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ, ఒలంపిక్స్, సొసైటీ జెండాలను ఆవిష్కరించారు. వివిద జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. మెదక్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పట్టణ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. మనం శారీరకంగా, మానసికంగా బలపడాలంటే క్రీడలు చాలా ఉపయోగపడుతాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సువర్ణలత మాట్లాడుతూ.. నిరంతర సాధనతోనూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, 13 గురుకులాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలిరోజు క్రీడాపోటీలు..

అండర్- 14, 17, 19 మూడు విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, క్యారమ్, హ్యాండ్‌బాల్, రన్నింగ్, బాల్ బ్యాడ్మింటన్, డిస్కస్‌త్రో, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీల జరుగనుండగా.. తొలి రోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. చెస్ అండర్-17 కేటగిరీ రామాయంపేట ప్రథమ, 3 వేల మీటర్స్ రన్నింగ్ అండర్-19 కేటగిరీలో మెదక్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 14 వ తేదీ వరకు స్పోర్ట్స్ మీట్ జరుగనుంది.

విద్యార్థులు పరిశోధనాత్మకంగా చదవాలి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశోధనాత్మకంగా చదవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్(జేడీ) లక్ష్మీనారాయణ సూచించారు. సంగారెడ్డి పట్టణం గీతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐటీ రామయ్య-ఇష్టా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదవాలే తప్పా ఒత్తిడి



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తో కాదన్నారు. అప్పుడే విజయం సాధ్యమవుతుందని గుర్తించాలన్నారు. ప్రతీ ఒక్కరు మంచి అనుభూతితో లక్ష్యం దిశగా ముందుకెళ్లాలన్నారు. ఏదేనీ 21 రోజులు చేస్తే అది అలవాటుగా మారుతుందని, విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, సెల్‌ఫోన్, సోషల్ మీడియా, ఇతరత్ర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యాభ్యాస దశలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థికి ఇంటర్ విద్య చాలా కీలకమని కష్టపడి చదివి అద్భుత భారతదేశాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇష్టా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వినోద్, కార్తిక్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణ భారమై వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సోమ్లాతండాలో జరిగింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం మండల పరిధిలోని తండాకు చెందిన మునావాత్ సోమ్లా(38) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేయలేక కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో మనోవేదనకు గురైన అతడు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. అర్ధరాత్రి వేళ ఊరి బయటకు వెళ్లిన గ్రామస్థులకు సోమ్లా మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సోమవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

బాధ్యతలు స్వీకరించిన బీసీ గురుకులాల ఆర్‌సీవో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్‌గా(ఆర్‌సీవో)గౌతమ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఆర్‌సీవోగా పనిచేసిన ప్రభాకర్ గత ఆగస్టు నెలలో ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఆర్‌సీవోగా సదాశివపేట(సంగారెడ్డి)పాఠశాల ప్రిన్సిపాల్ సంతోషి కొనసాగుతున్నారు. తాజాగా నూతన ఆర్‌సీవోగా గౌతమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బదిలీపై రావడంతో సంతోషి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల నిర్వహించిన ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లా పదో తరగతిలో 304 మంది పరీక్షకు హాజరు కాగా, 195 మంది ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో 61 మందికి 33 ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లాలో 258 మందికి 132 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌లో సంగారెడ్డి జిల్లాలో 709 మందికి 339 మంది, మెదక్ జిల్లాలో 179 మందికి 115 మంది, సిద్దిపేట జిల్లాలో 377 మందికి 192 మంది ఉత్తీర్ణులయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 20 వ తేదీ వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు.

అప్రెంటీస్ మేళాకు విశేషస్పందన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించారు. నేషనల్ అప్రెంటీస్ మేళాలో ఎనిమిది కంపెనీలు హాజరయ్యారు. అప్రెంటీస్ చేసేందుకు ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు సుమారు 500 మంది హాజరయ్యారు. అప్రెంటీస్ మేళాకు మంచి స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు.



అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

క్రైం కార్నర్

డీసీఎం, బైక్ ఢీకొని ఒకరి మృతి



వేణుగోపాల్ (ఫైల్)

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డికి చెందిన వడ్డెపల్లి వేణుగోపాల్ (32) ఆరు నెలల నుంచి హైదారాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం తన మిత్రుడు బొయిని రంజిత్ కుమార్ తో కలిసి హైదారాబాద్ నుంచి గ్రామానికి వస్తుండగా చేగుంట బైపాస్ రోడ్డు మక్కరాజిపేట్ బ్రిడ్జివద్ద రాంగ్ రూట్‌లో మూలమలుపు దాటుతున్న డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వేణుగోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న రంజిత్ కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోడ పైనుంచి పడి వలస కూలీ..

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకాబ్ పరిశ్రమలో హమాలీ కూలీగా పని చేస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట శివారులోని సోమవారం చోటుచేసకుంది. బీహార్‌కు చెందిన అభిమన్యు ఆదివారం రాత్రి పరిశ్రమ వద్ద పావురాలను పట్టుకునేందుకు గోడ ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు, బంధువులు పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటిపై నుంచి జారిపడి వ్యక్తి..



రాజు(ఫైల్)

మనోహరాబాద్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనాయిపల్లిపీటీ గ్రామానికి చెందన చిర్మనీ రాజు(52) తన ఇంటిపై చెట్టుకొమ్మను విరుస్తుండగా కాలుజారీ కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



చింటూ(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పేట ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దశంకరంపేటకు చెందిన జంగం చింటూ(25).. భార్య శిరీష, కొడుకుతో కలిసి బీరంగూడలో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం భార్య ప్రసవ సమయంలో వైద్య ఖర్చుల కోసం రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. కూలి పనులతో అప్పు ఎలా తీరుతుందని రోజూ భార్యతో చెబుతూ మదనపడేవాడు. ఈ క్రమంలో బంధువుల ఇంట పెళ్లి కోసం కుటుంబంతో కలిసి ఈ నెల 8న పెద్దశంకరంపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. సమగ్ర కుటుంబ సర్వే నిమిత్తం ఇక్కడే ఉండాలని భార్యకు సూచించి ఆదివారం సాయంత్రం బయటికెళ్లి గ్రామ శివారులోని తిరుమలాపూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక కూలీ..



రమేష్(ఫైల్)

రామయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చే మార్గంలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామయంపేట మండలం లక్ష్మాపూర్‌కు చెందిన వడ్డే పెద్ద రమేష్ (48)కు ముగ్గురు కూతుర్లు. పలుచోట్ల అప్పు చేసి ఇద్దరి కూతర్లకు పెళ్లి చేశాడు. కూలీ పనులతో అపుపలు తీర్చే స్థోమత లేకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటికెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సుగుణ చుట్టుపక్కల వారి సహాయంతో వెతకగా చెట్టుకు రమేష్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..



అనిత(ఫైల్)

టేక్మాల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాతలోత్ అనిత(28) ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయింది. పొద్దున ఎంతకీ నిద్రలేకపోవడంతో వెళ్లి చూడగా మృతిచెంది కనిపించింది. ఇంటి పక్క వారితో గొడవ కారణంగా తన భార్య మృతిచెందిదని భర్త ఆరోపించాడు. సమాచారం అందుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త నర్స్య నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు

- గుమ్మడిదల చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- వివిధ జిల్లాలో 200 వరకు కేసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

జిన్నారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడతుఉన్న నిందితుడిని పోలీసులు సోమూరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిన్నారం సర్కిల్ కార్యాలయంలో సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్ఐ మహేష్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న గుమ్మడిదల గ్రామానికి చెందిన చిమ్ముల రవీందర్‌రెడ్డి నివాసంలో పట్టపగలు చోరీ జరగగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు హమీద్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హైదరాబాద్ చార్మినార్ ఖాద్రిచమాన్ ప్రాంతానికి హమీద్ తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతడిపై పలు జిల్లాలో 200వరకు చోరీ కేసులు ఉన్నాయి. కేసులో చాకచాక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

మూఢనమ్మకాలతో భవిష్యత్ అంధకారం

- ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, నవంబరు (ఆంధజ్యోతి)11: మూఢనమ్మకాలతో భవిష్యత్‌ను అంధకారం అవుతుందని ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కూమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో కాళ్లకల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూఢనమ్మకాలపై నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సైంటిఫిక్ స్టూడెంట్ పెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ హాజరై మాంత్రికుల, భూత వైద్యుల, మోసం చేసే కుత్రలను, సైన్స్ మ్యూజిక్ షో రహస్యలను వివరించారు. అనంతరం ఎస్ఐ సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింగం, కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

● ఇద్దరికి గాయాలు



గాయపడిన మల్లయ్య, లక్ష్మీనర్సవ్వ

కొండపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. ఐనాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య, లక్ష్మీనర్సవ్వ దంపతులు ద్విచక్ర వాహనంపై తొగుటకు వెళ్తున్నారు. సిద్దిపేట వైపు నుంచి గజ్వేల్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో కింద పడిపోయారు. వారిద్దరికీ తీవ్రగాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి..

కొండపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం దుద్దెడ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన వరుణ్‌తేజ్ సిద్దిపేట నుంచి బందారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దుద్దెడ శివారులో అదుపుతప్పి డివైడర్‌కు ఢీ కొట్టుకున్నాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 20 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 20 మందికి రూ.35 వేల జరిమానా విధించారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేడు సిద్దిపేటలోని కరీంనగర్ రోడ్డు, అయ్యప్పగుడి, వడ్డెరకాలనీ, సుడా చౌరస్తా, లింగారెడ్డిపల్లి ఎక్స్ రోడ్డు, ఆర్టీఏ కార్యాలయం, సీసీ గార్డెన్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎన్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ఇరువైలా పెరిగిన చెట్ల కొమ్మలను నరకనున్నట్లు, అందుకే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

'దళారులను నమ్మొద్దు'

గజ్వేల్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ మండల పరిధిలోని దాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, వ్యవసాయ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాములుగౌడ్, సుబాష్‌చంద్రబోస్, రాజు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన చేర్యాల న్యాయవాదులు

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టుజడ్జి విజయ్‌సేన్‌రెడ్డిని చేర్యాల న్యాయవాదులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. చేర్యాల మున్సిఫ్ కోర్టుకు ఇటీవల 27 మంది సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో హర్షం వెలిబుచ్చుతూ జడ్జి విజయ్‌సేన్‌రెడ్డిని కలిసి సత్కరించారు. పట్టణానికి చెందిన ఏజీపీ అనంతుల రవీందర్, న్యాయవాదులు భూమిగారి మనోహర్, ఉట్కూరి అమర్, ప్రణీత్, మల్లేశం ఉన్నారు.

నిరంతర సాధనతో విజయం

కొండపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిరంతర సాధనతో విజయాలు సాధించవచ్చని కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రం అన్నారు. పాఠశాలకు చెందిన లక్ష్మీప్రసన్న వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా ఆమెను సోమవారం అభినందించారు. అలాగే ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి స్పోర్ట్స్ షూ బహూకరించగా.. రమేష్ అనే ఉపాధ్యాయుడు విద్యార్థినికి కావాల్సిన ఇతర ఖర్చుల కింద నగదును అందజేశారు. ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, బాల కనకయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షా కేంద్రం అలంకారప్రాయం

● ఏడాదిన్నర పూర్తయినా భూసార పరీక్షల ఊసేలేదు
● పరికరాలు, సిబ్బంది కేటాయింపు కరువు
● ప్రశ్నార్థకంగా గజ్వేల్‌లోని పరీక్షా కేంద్రం భవిష్యత్



గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం

గజ్వేల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పంట దిగుబడులు గణనీయంగా పెరగడానికి సూచనలు ఇవ్వాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి అన్నదాతలకు దన్నుగా నిలవాలన్న సదుద్దేశంతో గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో భూసార పరీక్షా కేంద్రాన్ని రూ.81.20 లక్షలతో నిర్మించి, 21, ఏప్రిల్ 2023న అప్పటి జిల్లా మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. నెలలు గడిచినా పరీక్షా కేంద్రానికి సిబ్బందిని కేటాయించింది లేదు, పరికరాలను అందించింది లేదు. దీంతో భూసార పరీక్షలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి ఉందని రైతులు భావిస్తుండగానే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పరికరాలు, సిబ్బందిని కేటాయిస్తుందా లేదా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

జిల్లా కేంద్రంలోనే భూసార పరీక్షా కేంద్రం

ప్రస్తుతానికి సిద్దిపేట జిల్లా కేంద్రంలో కేవలం ఒకే ఒక్క భూసార కేంద్రం ఉంది. ఇక్కడికి రైతులు మట్టి నమూనాలను తీసుకువెళ్లాలంటే దూరభారంతో పాటు ఖర్చుతో కూడుకున్న పని. దీంతో రైతులు ఎవరూ భూసార పరీక్షలకు ముందుకు రావడం లేదు. గజ్వేల్‌లో ఏర్పాటుచేసి రైతులకు భూసార పరీక్షలను చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా కనిపించడం లేదు. ఎంతో ఆర్భాటంగా భూసార పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన గత ప్రభుత్వం పరికరాలను, సిబ్బందిని కేటాయించకపోవడం ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ పరీక్షా కేంద్రానికి ఏడీఏతో పాటు ఏవోలు, ఏఈవోలు, ల్యాబ్ అసిస్టెంట్లు, అటెండర్లు అవసరం ఉంది. పరీక్షల నిమిత్తం పరికరాలు, కెమికల్స్ అవసరమవుతాయి. కానీ వాటిని కేటాయించకపోవడంతో గత ప్రభుత్వ సంకల్పం నెరవేరకపోగా, రైతులకు భూసార పరీక్షలు చేరువయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

భూసార పరీక్షా కేంద్రంతో ఇష్టారీతిన ఎరువుల వాడకానికి చెక్

భూసార పరీక్షా కేంద్రం ఏర్పాటై పరీక్షలు జరిగితే భూమికి అనుగుణంగా పంటలతో పాటు అవసరమైన మేర ఎరువులను వేసుకునే వెసులుబాటు ఉంటుంది. భూసార పరీక్షలు జరుపకపోవడంతో రైతులు ఇష్టారీతిన ఎరువులను వినియోగిస్తున్నారు. అంతేకాకుండా ఏకబిగిన ఒకే పంటను వేస్తూ అనేక నష్టాలకు గురవుతున్నారు. సిద్దిపేట జిల్లాలో దాదాపుగా ఆరు లక్షల ఎకరాల్లో ఆయా పంటలను రైతులు సాగుచేస్తున్నారు. నేల స్వభావం తెలియకపోవడంతో రైతులు ఎరువులను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడులు తగ్గడం, పెరగడం, నేల తన సహజ స్వభావాన్ని కోల్పోవడంతో పాటు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. భూసార పరీక్షలు నిర్వహిస్తే పోషకాల లోపాలను గుర్తించి అవసరమైన మేరకే ఎరువులను వినియోగించే వీలు కలుగుతుంది.

ప్రమాదకరంగా కల్వర్టు

● ఇనుప చువ్వలు తేలడంతో తరచూ ప్రమాదాలు



ఇనుప చువ్వలు తేలిన నాగపురి-షబాషీగూడెం గ్రామాల శివారులోని కల్వర్టు

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం నాగపురి-షబాషీగూడెం గ్రామాల శివారులో కొన్నాళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టకపోవడంతో సీసీ లేచి ఇనుప చువ్వలు తేలియాడుతున్నాయి. నిత్యం ఈదారి వెంట ఎంతోమంది హైదరాబాద్, కొండపోచమ్మ ఆలయం, యాదాద్రి, జగదేవ్‌పూర్ మండలాలకు ప్రయాణిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కల్వర్టు మధ్యభాగంలో సీసీ దెబ్బతిని ఇనుప చువ్వలు తేలడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ద్విచక్ర వాహన టైర్లు ఇరుక్కుంటుండటంతో ప్రమాదాల పాలవుతున్నారు. కొద్దిరోజుల క్రితం కల్వర్టు వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, కొంతమందికి గాయాలయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీఆర్ఎస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్



విలేకరులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకుడు సమీర్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీని ఓడించినందుకు తెలంగాణ ప్రజలపై కక్ష పెట్టుకున్నాయని, అందుకే తెలంగాణ ప్రజలకు ఏ సంక్షేమ పథకాలు అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయన్నారు. ప్రజలకు అందకుండా చేయాలన్నదే వారి కుట్ర అని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. వారివెంట పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, పార్టీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వహీద్‌ఖాన్, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివులు ఉన్నారు.

రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు: సీఐ లతీఫ్

తొగుట /కొండపాక/దుబ్బాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణం కావద్దని తొగుట సీఐ లతీఫ్ రైతులకు సూచించారు. సోమవారం తొగుట మండలం పెద్ద మాసాన్ పల్లి గ్రామ శివారులోని రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులకు తొగుట పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, ఏఈవో నాగార్జున, పోలీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ప్రతీ వ్యక్తి జీవితంలో పాఠశాల దశ ఎంతో కీలకమైందని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. కొండపాక కేజీబీవీ పాఠశాలలో సోమవారం విద్యార్థునులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపల్ గౌతమి, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయొద్దని ఎస్ఐ గంగరాజు రైతులకు అవగాహన కల్పించారు.

'చదువుతోనే గుర్తింపు'

చిన్నకోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తోట ఫౌండేషన్ డైరెక్టర్ ఆవుల శ్రవణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతూ టెన్త్, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది పేద విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అనంతసాగర్ పాఠశాలలో రూ.78 వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఫౌండేషన్ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు



అభిషేకాలు నిర్వహించిన భక్తులు

మద్దూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామాలయంలో కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భక్తులు రామలింగేశ్వరునికి ఘనంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి భక్తి ప్రపత్తులతో పుష్పాభిషేకం, క్షీరాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్ధన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి స్వాతిరెడ్డి

చిన్నకోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పోక్సో, బాల్య వివాహాలు, బాల కార్మికుల చట్టాల గురించి వివరించారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, విద్యార్థినుల హాస్టల్, వంట గదిని విద్యార్థులకు అందిస్తున్న భోజనం, టాయిలెట్స్ మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, హాస్టల్ ఇన్‌చార్జి నీలిమ, న్యాయసేవ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా రవితేజ

సిద్దిపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన గుండు రవితేజను నియమించినట్లు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో రవితేజ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇచ్చిన ప్రతాని రామకృష్ణగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమా ఫొటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారని, వారికి చేనేత మగ్గంపై నేసిన గొల్లభామ కోటు తయారు చేయించి ఇచ్చామని తెలిపారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



మల్లన్న ఆలయ ముఖమండపంలో జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు

వర్గల్/చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అలాగే కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. మల్లన్న ఆలయ ముఖమండపంలో అర్చకులు ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు.

'అబుల్ కలాం ఆజాద్ కృషి గొప్పది'

గజ్వేల్/సిద్దిపేట కల్చరల్/మిరుదొడ్డి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి గొప్పదని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గణపతిరావు అన్నారు. గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సామాజికశాస్త్ర విభాగాలు, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ సునీత, ముఖ్యవక్తగా ఆంగ్ల విభాగాధిపతి సహాయ ఆచార్యులు డా.ఉమామహేశ్వరి హాజరయ్యారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి మండల పరిషత్ పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

చిన్నకోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. చిన్నకోడూరులో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కొటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై రైడ్ చేసి రూ.6 వేల విలువ గల మద్యం సీసాలను, ఎలాంటి పేపర్లు లేని 45 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడారు. వాహనదారులు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నిర్వాసితులు, సీపీఐ నాయకులు

గజ్వేల్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మల్లన్నసాగర్ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర అధ్యక్షురాలు సజ్జనికుమారి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన భూనిర్వాసితులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి.. అనంతరం కలెక్టర్ మనూచౌదరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు గూడెం పద్మ, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, భూనిర్వాసితులు పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని మల్లన్నసాగ ర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత

కుకునూరుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లికి చెందిన షాకీర్, తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనకసేన గతంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో గుర్తించి ఎస్ఐ శ్రీనివాస్ అందజేశారు.

ఇంటికి గంట

ఐదోపేజీ తరువాయి..

ట్లుగా తెలుస్తోంది. ఈ లెక్కన 4లక్షలకు పైగానే కుటుంబాల వద్దకు ఎన్యూమరేటర్లు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు 40,232 కుటుంబాలకు సంబంధించిన వివరాలను మాత్రమే సేకరించారు. జిల్లా మొత్తంగా 2,302 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. సగటున ఒక్కో ఎన్యూమరేటర్ 10 నుంచి 15 కుటుంబాలను మాత్రమే సర్వే చేసినట్లుగా తెలుస్తోంది. ఈ పత్రాలను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లకు అందజేస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో పొందుపర్చడం లేదు. ఈనెల 20 వరకు అంటే మరో 9 రోజులు మాత్రమే గడువు ఉంది. ప్రస్తుతానికి రోజుకు సగటున 15వేల కుటుంబాల సర్వే జరుగుతున్నది. ఈ లెక్కన 9 రోజుల్లో సర్వేను పూర్తి చేయడం సాధ్యపడకపోవచ్చు. పైగా మధ్యాహ్నం తర్వాతనే సర్వే చేయాల్సి రావడంతో ఇళ్ల వద్ద చాలామంది ఉండట్లేదని, వారికోసం పదేపదే ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఈనెలాఖరు వరకు గడువు ఇస్తే ప్రయోజనంగా ఉంటుందని ఎన్యూమరేటర్లు భావిస్తున్నారు.

మునిసిపల్ సమావేశంలో పలు తీర్మానాలు

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మునిసిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య, విద్యుత్‌దీపాల నిర్వహణ, మరమ్మతులతో పాటు సీసీరోడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో కమిషనర్ నాగేందర్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు భార్గవి



భార్గవిని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

మద్దూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వీ.భార్గవి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈవో వరదరాజు మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 10 వరకు హుస్నాబాద్‌లో నిర్వహించిన హ్యాండ్‌బాల్ అండర్-14 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెల 25 నుంచి 29 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం మహాసముద్రం జిల్లాలో జరగనున్న ఎస్జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని భార్గవిని, పీడీ ఎండీ.రఫత్‌ను ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ నిర్మల, సెక్రటరీ మాదవ్, ఆర్ఐ రమేష్, వెంకటేష్ అభినందించినట్లు తెలిపారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఇద్దరు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 20వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నైలో జరిగే జాతీయస్థాయి సైక్లింగ్ (ట్రాక్ విభాగం) పోటీలకు సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిజ్వానాబేగం, పదో తరగతి చదువుతున్న డీ.వర్షిత ఎంపికయ్యారు. అలాగే మరో కేటగిరీలో జనగామలో జరిగిన రోడ్డు నేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న పదో తరగతి చదువుతున్న పీ.అంకిత, ఎస్.సాయి ప్రసన్న, తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎం.లిఖిత ప్రతిభ కనబరిచి డిసెంబరులో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయరు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నీలగంటి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్ పాతూరి సుజాత, స్టాఫ్ సెక్రటరీ ఆఫీసర్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

గజ్వేల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున వాలీబాల్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్ తెలిపారు. చేగుంటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలో పాఠశాలకు చెందిన బీ.అక్షిత, ఎస్.పవిత్ర అండర్-14 విభాగంలో, స్వామినాయక్, కావ్య, ఇందు, దక్షేశ్వరీ అండర్-17 విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 17న చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆయనవెంట ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన జక్కాపూర్ విద్యార్థులు

సిద్దిపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సదిశ ఫౌండేషన్ రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చింతల అన్వేష్, బురుజు కింది ప్రశాంత్, ఈర్ల సౌమ్య, యాట అనూష, కూరాటి లిఖిత ఉత్తమ ఫలితాలు సాధించి రెండేళ్ల ఉచిత ఇంటర్ కార్పొరేట్ విద్యకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం అరుణకొండలో జరిగిన ఈ పరీక్షకు దాదాపు 1,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 21 మంది విద్యార్థులు ఎంపిక కాగా జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచే ఐదుగురు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిని ప్రోత్సహించిన గణిత ఉపాధ్యాయులు మట్ట మల్లారెడ్డి, పాతూరి తిరుపతిని అభినందించారు.

తండ్రికి కూతురు తలకొరివి



తండ్రి కిష్టయ్యకు తలకొరివి పెట్టిన ఉమ

ములుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటు చేసుకున్నది. ములుగుకు చెందిన కుమ్మరి కృష్ణయ్య ప్రభుత్వ పాఠశాలలో 20 ఏళ్లు అటెండర్‌గా పనిచేశాడు. కానీ ఇప్పటివరకూ ఆయనకు పర్మినెంట్ కాకపోవడంతో మనోవేదనకు గురై అనారోగ్యం పాలయ్యాడు. వారంరోజులుగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి కుమారులు లేకపోవడంతో కూతురు ఉమ తలకొరివి పెట్టింది. కాగా ఎఫ్‌జెడ్ ఫౌండేషన్ చైర్మన్ జుబేర్ రూ.10 వేలు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్క అంజిరెడ్డి రూ.10 వేలు, అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కడవల నరసింహారెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

మిరుదొడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ పాఠశాలలోని విద్యార్థులకు సిద్దిపేట షీటీం ఏఎస్ఐ కిషన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.